కథ

పెబ్బిలి హైమావతి

**"హలో! శేషగిరిగారున్నారాండీ?"**

**"హలో, నేను శేషగిరినే మాట్లాడుతున్నాను" అన్నాడు శేషగిరి అవతలివారు ఎవరో అర్థంగాక.**

**"ఏరా నన్ను గుర్తుపట్టలేదా? నేనూ ప్రసాద్‌ని"**

**"అరే ప్రసాద్! నువ్వా? ఎక్కడి నుండి మాట్లాడుతున్నావు?" అన్నాడు శేషగిరి ఉత్సాహంగా.**

# ఆనాటి చెలిమి ఒక కల...

''ఇక్కడి నుండే మాట్లాడుతున్నాను..'' ప్రసాద్ మాట పూర్తికాకుండానే శేషగిరి అందుకున్నాడు.

''అన్యాయంరా ఇది. మా ఊరు వచ్చి ఫోన్ చేయడమేమిట్రా? సరాసరి ఇంటికి రాక?'' అన్నాడు శేషగిరి నిష్ఠూరంగా.

''చాల్లేరా బాబూ, అసలు ఫోన్‌లోనయినా నువ్వు అందుతావో..లేదోనని బెంగపడ్డాను తెల్సా? ఎందుకైనా మంచిదని హోటల్లో దిగాను'' అన్నాడు ప్రసాద్.

''చాలుగాని త్వరగా తయారవు. నేనొచ్చి పికప్ చేసుకుంటాను. ఇంతకీ ఏ హోటల్లో దిగావురా?'' అన్నాడు శేషగిరి.

''హోటల్ అనంత్‌లో దిగాను''

''సరే, నేను వస్తున్నాను'' అంటూ ఫోన్ పెట్టేశాడు శేషగిరి.

మిత్రుడ్ని చాలా సంవత్సరాల తరువాత కలవబోతున్న ఆనందం శేషగిరిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తన మిత్రుడు ప్రసాద్ వస్తున్న విషయం భార్యతో చెప్పి..టిఫిన్ ఏర్పాట్లు చూడమని హుషారుగా బయలుదేరాడు ప్రసాద్‌ను తీసుకువచ్చేందుకు.

ప్రసాద్ కొడుక్కి ఇంజనీరింగ్‌లో సీటు రావడంతో కొడుకుని జాయిన్ చేసేందుకు విశాఖపట్టణం వచ్చాడు ప్రసాద్. శేషగిరి విశాఖలో ఉంటున్నట్లు తెలుసుకొని ప్రస్తుతం ఉన్నదీ, లేనిదీ కన్‌ఫర్మ్ చేసుకునేందుకే ఫోన్ చేశాడు. ఎప్పుడో తాను యూనివర్సిటీలో చదివేప్పుడు తప్ప మళ్ళీ ఈ ఊరు రాలేదు. అప్పటికే శేషగిరి డిగ్రీతోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి ఉద్యోగంలో చేరడం, పెళ్ళి చేసుకొని సెటిల్ అయిపోవడం జరిగిపోయింది. ఈమధ్యకాలంలో ఒకటి రెండుసార్లు తప్ప పెద్దగా కలుసుకున్నది లేదు ఇద్దరూ. దూరంగా ఉన్నాకాని ఏదో విధంగా ఒకరి సమాచారాలు మరొకరికి తెలుస్తూనే ఉన్నాయి.

ప్రసాద్ ఆలోచనల నుండి తేరుకొనకమునుపే శేషగిరి అక్కడకు చేరుకున్నాడు.

చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆనందం ఇద్దరి ముఖాల్లోనూ కదలాడింది.

''ఏరా, బాగున్నావా?'' అన్నాడు ప్రసాద్ ఆప్యాయంగా చూస్తూ.

''బాగానే ఉన్నాను గానీ, ఏమిట్రా, చెప్పా పెట్టకుండా ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావు?'' అన్నాడు శేషగిరి.

''మా వాడికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చిందిరా! జాయిన్ చేసేందుకు తీసుకు వచ్చాను'' అన్నాడు ప్రసాద్.

''అలాగా? కంగ్రాట్యులేషన్స్‌రా!'' అన్నాడు శేషగిరి ఆనందంగా.

''ఎవరికి నాకా, వాడికా?'' అన్నాడు ప్రసాద్ హాస్యంగా.

''వ్వార్నీ నువ్వేం మారలేదురా!'' అన్నాడు శేషగిరి స్నేహితుడి భుజాన్ని తడుతూ.

''ఎందుకు మారాలిరా!'' అనడిగాడు ప్రసాద్ తమాషాగా చూస్తూ. సమాధానం చెప్పలేనట్లు చూశాడు శేషగిరి.

''సరేగానీ, మీ పిల్లలేం చదువుతున్నార్రా?'' అడిగాడు ప్రసాద్.

''బాబు ఇంటరు సెకండియర్, పాప టెన్త్. అవునూ, మీ బాబుకంటే..ముందు పాప కదూ! పెళ్ళి చేసేశావా ఏమిటి అప్పుడే?'' అన్నాడు శేషగిరి.

''అదేం లేదు లేరా! పాప గుంటూరులో మెడిసిన్ చదువుతోంది''

''నిజంగా! అయితే మీ వాళ్ళిద్దరూ సెటిల్ అయినట్లే..మా బడుద్దాయిలేం చేస్తారో?'' అన్నాడు శేషగిరి.

ఇంతలో ప్రసాద్ కొడుకు అశోక్ అక్కడికి రావడంతో శేషగిరికి పరిచయం చేశాడు ప్రసాద్.

''ఇక బయలుదేరుదామా?'' అన్నాడు శేషగిరి.

''సరే పద!'' అన్నాడు ప్రసాద్.

''అదేమిటి? ఇలాగే వస్తావా? సామాన్లో?'' అన్నాడు శేషగిరి ఆశ్చర్యంగా చూస్తూ.

''సామాన్లెందుకులేరా!'' అన్నాడు ప్రసాద్ మొహమాటంగా.

''అదేం కుదరదు, అక్కడ మీ సిస్టర్ ఎదురు చూస్తుంటుంది. పదండి!'' అంటూ తనే సామాన్లు సర్దసాగాడు శేషగిరి.

కాదనలేకపోయాడు ప్రసాద్. వాళ్ళు వచ్చేసరికి కాఫీ ఫలహారాలు సిద్ధం చేసి ఉంచింది పార్వతి.

''ఇల్లు చాలా బాగా కట్టావురా! ఎంతైందేమిటి?'' అనడిగాడు ప్రసాద్ ఇల్లంతా కలియజూస్తూ.

''మూడు లక్షల పైనే అయిందిరా! ఆఫీసులో హౌసింగ్‌లోన్ గాక, కొంత ప్రైవేటు లోను కూడా తీసుకున్నాను. మరి నీ సంగతేమిటి?'' అన్నాడు శేషగిరి.

''నేనొక్కచోట స్థిరంగా ఉంటున్నానా, ఇల్లు కట్టేందుకు? విజయవాడలో అపార్టుమెంటు తీసుకున్నానంతే!'' అన్నాడు ప్రసాద్.

''పోన్లేరా, ఇల్లుదేముంది? పిల్లలు సెటిల్ అయ్యారు, అదే చాలు!'' అన్నాడు శేషగిరి.

''ఏం సెటిల్ అవ్వడమోరా! పాప గుంటూరు, వీడు విశాఖ. మేమేమో ప్రస్తుతం విజయవాడ, నెక్స్ట్ మంత్ బందరు..ఈ ట్రాన్స్‌ఫర్స్‌తో చచ్చిపోతున్నాననుకో!'' అన్నాడు విసుగ్గా.

''అదేమిట్రా! మన ఊరు ట్రాన్స్‌ఫర్ అయినందుకు ఆనందించక అలా బాధపడతావు? ఆ పాత రోజులు..ఆ తీపి జ్ఞాపకాలు..మళ్ళీ మననం చేసుకోవచ్చు'' అన్నాడు శేషగిరి ఉత్సాహంగా.

''ఆపరా బాబూ! పేరుకు మన ఊరే. మన బేచ్‌మేట్స్ ఎవరూ లేరు. ఉన్న ఒకరిద్దరూ సరిగా కలవరు. అంతా మెకానికల్‌గా తయారయ్యారు. ఇక పాత జ్ఞాపకాలేం నెమరు వేసుకుంటాం?'' అన్నాడు ప్రసాద్ నీరసంగా.


''అదేంట్రా ఆ రోజులు మళ్ళీ రావురా! ఎంత అందమైన రోజులవి?'' అన్నాడు శేషగిరి మైమరపుగా.

''అరేయ్! నేనొచ్చాను గనుక నీకవన్నీ గుర్తొస్తున్నాయిప్పుడు. అంత గుర్తున్నవాడివైతే ఇన్నేళ్ళలో ఒక్క ఉత్తరం ముక్కయినా రాశావా ఎప్పుడైనా? అక్కడ ఇల్లు అమ్మేసి మీ ఫాదర్, మదర్ ఇక్కడికి వచ్చేశాక బందరే మర్చిపోయావు పూర్తిగా!''

అన్నాడు ప్రసాద్ నిష్ఠూరంగా.

అంతా వింటున్న పార్వతి కల్పించుకుంది. ''అదేం లేదు లెండి అన్నయ్యగారూ! ఏ కాస్త సందు దొరికినా పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని మీ గూర్చే చెప్తూంటారెప్పుడూ. ముఖ్యంగా మీ హాకీ ఆటలూ, బొంబాయి కాలువలో ఈతలూ..ఒకటేమిటి? నాగేశ్వరస్వామి గుడిలో ప్రసాదాల దగ్గర నుండి బృందావన్ సినిమా హాలు ఆవరణలో సాయంత్రాలు మీరు వినే హిందీ పాటల గూర్చి, అన్నీ..చెప్తుంటారు'' అంది.

''ఏం లాభం? ఏదో ఇలా కలిసినప్పుడే కదులుతాయవన్నీ! విడిపోతే..ఇకంతే సంగతులు..సంవత్సరాల తరబడి సమాచారమే ఉండదు!'' అన్నాడు ప్రసాద్.



''అదేం లేదు లేరా! ఈమధ్య నేనటువైపు రాలేకపోయాను. సరేగానీ..మనవాళ్ళు..పాండు, మధు, నాగేశ్వరరావు ఎవరైనా కలిశారా?''

''ఎందుకడుగుతావులే అవన్నీ..ఉద్యోగరీత్యా ఎన్ని ఊళ్ళు తిరిగినా..మన ఊరి మీద మమకారం చావక సంవత్సరానికి ఒకసారయినా వెళ్ళి వస్తూంటాను. మధూ, శంకర్ అంతా ఊళ్ళొదిలి వెళ్ళిపోయినా..కొన్నాళ్ళు ఉత్తరాల్లో బాగానే పలకరించుకున్నాం. ఆ తరువాత మామధ్య కూడా ఏ కమ్యూనికేషనూ లేదు. ఇక పాండూ..వాడు మన హిందూ కాలేజీలో పీ.డీగా చేస్తున్నాడు. పుట్టినప్పటి నుండీ మన ఊరు వదలంది వాడొక్కడే. సరే..నాగేశ్వరరావు సంగతి మనందరికీ తెలిసిందేగా, ఒంటికాయి సొంటికొమ్ము వ్యవహారం. వాడేదో బిజినెస్ పెట్టుకొన్నాడక్కడే! మూడు పువ్వులూ, ఆరుకాయలుగా ఉంది వాడి పని..కార్లలో తిరిగే వాళ్ళు తప్ప ఇంకెవరూ కనిపించడం లేదు వాడికిప్పుడు.

ఆమధ్య ఏదో మనసాగక వాళ్ళింటికి వెళ్ళాను. పట్టుమని పది నిమిషాలు నాతో మాట్లాడడానికి కూడా తీరిక లేనట్లు బిహేవ్ చేశాడు. తప్పనిసరై మర్యాదకోసం కాఫీ మాత్రం ఆఫర్ చేశాడులే...ఇక జన్మలో వాడింటికెప్పుడూ వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాను ఆరోజే!

ఇక మన శంకరం..వాడి చెల్లెలు శమంత పెళ్ళికి..వాడితో పాటు మనమెంత కష్టపడ్డాం? ఆ రోజుల్లో ఇప్పట్లాగ అప్పుడు కళ్యాణమండపాల్లో కాదుకదా పెళ్ళిళ్ళు..ఇంటి ముందు పందిరి దగ్గర నుండీ ఇల్లు అలంకరణా, బజారు పనీ, వడ్డనా అంతా మన భుజాల మీద వేసుకొని చేశాము. పది రోజులపాటు నిద్రాహారాలు లేకుండా కష్టపడ్డాం స్వంతమనుషుల్లా. నేను ఏదో ఆఫీసు పనిమీద బొంబాయి హెడ్డాఫీసుకు వెళ్ళవలసి వచ్చింది. శంకరం బొంబాయిలోనే వున్నాడని తెలిసి...అతి కష్టం మీద వాడి అడ్రసు కనుక్కొని వెళ్ళాను వాడింటికి చూడాలన్న ఆశతోనూ..ఆ వంకన తనివితీరా నాలుగు రోజులు వాడితో కులాసాగా గడిపి..పాత జ్ఞాపకాలు నెమరు వేసుకోవచ్చని అనుకున్నాను. కానీ శంకర్ స్వాగతించిన తీరు చూశాక..మనుషులింత కమర్షియల్‌గా ఎలా మారిపోతారో నాకేం అర్థం కాలేదురా. హోటల్ ఖర్చు తగ్గించుకునేందుకే వాడింటికి వెళ్ళినట్లు మాట్లాడాడురా..పోనీ వాడిల్లు ఇరుకా అంటే అదేం కాదు. నేను ఆఫీసు పని మీద తిరుగుతూ, భోజనం కూడా బయటే చేసేవాడిని. కేవలం రాత్రిపూట పడుకునేందుకే అక్కడికి వెళ్ళాను. వాడితో ముచ్చట్లు నెమరేసుకోవచ్చని...కాని వాడి ఇరుకు మనస్తత్వం చూశాక రెండు రోజులకే మకాం మార్చేశాను. ఆఫీసుకు దూరమైపోతోందని..ఈ అనుభవాలు చూశాకే..ఇక్కడికి వచ్చాక హోటల్లో దిగింది. నువ్వెలా రియాక్టవుతావోనని'' అన్నాడు ప్రసాద్ తాను హోటల్‌లో దిగిన కారణం వివరిస్తూ.

''బాగుందిరా...వాళ్ళేదో చేశారని గుర్రాన్నీ, గాడిదనూ ఒకే గాట కట్టేశావన్నమాట. ఏదో నా సమస్యల్లో నేనుండి మీతో కలవలేకపోవచ్చు. కానీ ఆనాటి తీపి జ్ఞాపకాలు నేనెలా మరచిపోతాననుకున్నావురా? ఎంత హాపీగా ఉండేవాళ్ళం మనమనంతా..ఏమయిపోయిందిరా అదంతా..ఎంత స్వచ్ఛమైన స్నేహం అది. మంచి గంధం, మల్లెపూల గుబాళింపులాంటి జ్ఞాపకాలు నా గుండెల్లో ఎప్పుడూ సజీవంగానే ఉంటాయిరా!'' అన్నాడు శేషగిరి మైమరపుగా.

''నిజమేరా..ఆరోజులు మళ్ళీ తిరిగిరావురా... అప్పటికీ..ఇప్పటికీ..ఫ్రెండ్షిప్‌కి నిర్వచనమే మారిపోయింది. ప్రతీదీ బిజినెస్సే...స్నేహం కూడా స్టేటస్ సింబలే. మా పిల్లలు చెపుతుంటారు కదా..ప్రొఫెషనల్ కాలేజీల్లో కూడా అవసరార్థం

స్నేహాలే. ఓ పక్క మనతో నవ్వుతూ మాట్లాడుతూనే..మనం కాస్త పక్కకు తిరగ్గానే..మన గురించి మరొకరికి చెడుగా చెప్పడమో..బేడ్గా కామెంట్ చేయడమో చేస్తుంటారట'' అన్నాడు ప్రసాద్ బాధగా.

''నిజమేరా..తినే ఆహారం, పీల్చే గాలి ఎలా కలుషితం అయిపోయాయో..మనిషి మాట, నవ్వు, స్నేహం అన్నీ కల్తీయేరా! అందుకే, ఫోన్లో నీ మాట వినగానే ప్రాణం లేచి వచ్చిందనుకో! అప్పటికీ..ఇప్పటికీ ఏం మారలేదు నువ్వు!'' అన్నాడు శేషగిరి.

''నువ్వు మాత్రం మారావా, కనబడితే ప్రాణం పెడతావు. కనుమరుగైతే అంతే సంగతులు!'' అన్నాడు ప్రసాద్ ఎప్పటిలాగే నిష్కర్షగా.

## వ్యక్తిత్వం

**కొంతవయసొచ్చాక పిల్లల ఆలోచనల్లో పరిపక్వత చోటుచేసుకుంటుంది. అయితే కొంతమంది తారల విషయంలో ఇది మినహాయింపేమో. హేమమాలిని తనయ ఇషా డియోల్ ఎప్పుడూ తల్లి సలహా ప్రకారమే నడుచుకుంటుందిట. ఏ సినిమాకి వెళ్లాలన్నా, షూటింగ్స్‌కి హాజరవ్వాలన్నా తల్లి అనుమతి తప్పక తీసుకుంటుంది. ఈ విషయంలో ఆమె ఇతర తారలకన్నా విభిన్నమైనదే అంటున్నారంతా. వీరిద్దరూ చాలా క్లోజ్‌ఫ్రెండ్స్‌గా ఉంటారట.**

''దెప్పుకురా! తప్పయిందని ఒప్పుకుంటున్నానుగా! ఇక వదిలెయ్!'' అన్నాడు శేషగిరి.

''అంత తొందరగా వదుల్తానురా నిన్ను? మా ఇంటికి వచ్చేవరకూ ఇలాగే సాధించుకు తింటాను నిన్ను'' అన్నాడు ప్రసాద్.

''ఒరేయ్, అలాంటి ఫిటింగ్‌లు పెట్టకురా నాయనా! ఎప్పుడో వీలు చూసుకొని వస్తాలేరా!'' అన్నాడు శేషగిరి.

''ఎప్పుడురా, నీకు వీలయ్యేది? మనం రిటైర్ అయ్యాకా?''

అంతా వింటున్న పిల్లలు ''వెళ్దాం నాన్నగారూ! మీ ఊరు గురించి వినడమే గాని చూడ లేదెప్పుడూ!'' అంది అరుణ.

''అవున్నాన్నగారూ! వెళ్దాం'' అన్నాడు కిరణ్ ఉత్సాహంగా.

చివరికి ప్రసాద్ ఉండగానే ఆగస్టు పదిహేను, సెకండ్ సాటర్ డే, సండే కలిసి వచ్చేట్లుగా ప్రోగ్రాం ఫిక్స్ చేసుకున్నారు.

★ ★ ★

''రండి, రండి, బాగున్నారా? చూసి చాలా కాలమైంది. ఎప్పుడో మా పాప పుట్టినప్పుడు వచ్చారు మా ఇంటికి'' అంది ప్రసాద్ భార్య పద్మ.

''అవును, దాదాపు పద్దెనిమిది సంవత్సరాలైంది మనం కలిసి'' అంది పార్వతి. ఇద్దరూ కబుర్లలో పడిపోయారు. ప్రసాద్, శేషగిరి చిన్ననాటి ముచ్చట్లు నెమరు వేసుకోసాగారు.

పిల్లలు అంతకంటే స్పీడుగా కలిసిపోయారు. సినిమాలూ, కామిక్సూ..ఒకటేమిటి అన్నీ దొర్లిపోయాయి వాళ్ళమధ్య.


భోజనాలయిపోయాక అంతా కలిసి పంపుల చెరువుకు వెళ్దాం అని ప్రపోజల్ పెట్టింది పార్వతి.

''పంపుల చెరువా? అదేంటి, వాటర్ ప్యూరిఫై చేసే ట్యాంకే కదా! అక్కడేమిటి అంత విశేషం?'' అన్నాడు కిరణ్.

''అలా తీసి పారేయకురా! అక్కడ చాలా పెద్ద చెరువులు రెండున్నాయి. చుట్టూ గార్డెన్ ఉంటుంది. ఊరికి దూరంగా ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ ఉన్నంతకాలం మీ అమ్మా, నేనూ రోజా నడుచుకుంటూ షికారుగా అక్కడికే వెళ్ళే వాళ్ళం. ఆ చెరువుగట్టు మీద కూర్చొని మీ అమ్మ పాటలు పాడుతుంటే నేను హాయిగా వింటూండే వాడిని. ఆ ప్లేసంటే మీ అమ్మకి చాలా ఇష్టం'' అన్నాడు శేషగిరి.

''ఓహో, అయితే..అది మీ లవింగ్ స్పాటా?'' అన్నాడు కిరణ్.

''ఛ! నోరు ముయ్యరా..అన్నీ పెద్ద మాటలు మాట్లాడతావు. రోజా పంపుల చెరువు నుండి కోనేటి సెంటర్ మీదుగా వస్తుంటే అక్కడ ఫౌంటెన్ రంగు రంగుల బల్బులతో ఎంత బాగుండేదో తెలుసా? అది చూసేందుకే వెళ్తూండే వాళ్ళం అటు.



''అయితే..మరి చిలకలపూడి, మంగినపూడి ఎప్పుడు తీసుకెళ్తారు నాన్నా?'' అనడిగింది అరుణ.

''పంపుల చెరువులో పంపులూ, చిలకలపూడిలో చిలకలూ తప్ప ఇంకేం లేవా నాన్నా ఇక్కడ?'' అన్నాడు కిరణ్ అల్లరిగా తండ్రి వంక చూస్తూ.

అన్నీ తెలిసే..తమని టీజ్ చేయడానికే కొడుకిలా మాట్లాడుతున్నాడని అర్థమైన శేషగిరి నవ్వేస్తూ..''చాల్లేరా నీ అల్లరి..కాంక్రీట్ జంగిల్‌లో నివసించే నీకు..ఇక్కడి స్వచ్ఛమైన గాలీ వెలుతురూ గురించి ఎలా చెప్తే అర్థమవుతుంది? చూశాక మాట్లాడుదువుగానిలే!'' అన్నాడు శేషగిరి నవ్వేస్తూ.

ఉన్న రెండు రోజులూ అన్నట్లుగానే ఊరంతా తిప్పి చూపించాడు శేషగిరి పిల్లలకు..అమ్మేసిన తమ ఇంటిని చూడగానే తండ్రి కంట్లో మెరిసిన వెలుగు చూడగానే పిల్లలిద్దరి మనసులూ బరువెక్కాయి.

ఇల్లు కొనుక్కున్నవారు..శేషగిరి కుటుంబాన్ని ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. వారి బలవంతాన ఆ పూట అందరూ అక్కడే భోజనం చేశారు. ఆ ఇంటిలోని అణువణువునూ శేషగిరి పరిచయం చేస్తూంటే ఆసక్తిగా చూశారు పిల్లలిద్దరూ. ఏ మనిషికైనా బాల్యం అనేది ఓ మధురమైన జ్ఞాపకం. దాన్ని ఎంతకాలం గడిచినా చెక్కు చెదరకుండా అపురూపంగా గుండెల్లో దాచుకొన్న తండ్రి పట్ల ఆరాధనా భావం కలిగింది పిల్లలిద్దరికీ. మూడు రోజులూ మూడు నిముషాల్లా గడిచిపోయాయి. విడిపోయే సమయం దగ్గరకు వచ్చేసరికి అందరి ముఖాల్లో దిగులు ఆవరించింది. పిల్లలయితే..చిరకాల మిత్రుల్లా అడ్రసులిచ్చి పుచ్చుకొని ఎంతో దిగులుగా వీడ్కోలు చెప్పుకున్నారు.

''ఏరా, వెళ్ళాక ఉత్తరం రాస్తావా? ఇంతే సంగతులా?'' అంటున్న ప్రసాద్ మాటలను విననట్లుగా..ఒకరి చేతులొకరు పట్టుకొని ఆత్మీయంగా మాట్లాడుకొంటున్న పిల్లలవైపు చూసి సంతృప్తిగా నిట్టూర్చాడు. ఇంతకాలపు తమ స్నేహలతకు తొడిగిన కొత్త చిగురులా పిల్లల మధ్య అంకురించిన స్నేహాన్ని చూసి, మా స్నేహం కల కాదు..నిత్యనూతనం...నిరంతర వాహిని అనుకున్నారు మిత్రులిద్దరూ ఆనందంగా.